కొత్త విద్యుత్ కనెక్షన్లకు నిరీక్షణ

- విద్యుత్ మోటార్ల కొత్త కనెక్షన్ల మంజూరులో జాప్యం?
- వరదకాలువ సమీప రైతుల ఆవేదన
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వైనం
- జిల్లాలో సుమారు వెయ్యి మందికి పైగా ఎదురుచూపులు

కథలాపూర్: రైతులను సాగుకు ప్రోత్సహించడానికి ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతూ సాగుపై వారికి భరోసా కలిగిస్తోంది. కానీ వృథాగా ఉంటున్న భూములను సాగులోకి తీసుకురావడానికి, ప్రస్తుతం సాగుచేసిన పంటలకు కాపాడుకోవడానికి నీళ్లు పారించాలంటే కొత్తగా విద్యుత్ మోటార్లకు కనెక్షన్లు మంజూరు ఇవ్వడంలో జాప్యం చేస్తోంది. దీంతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోతున్నారు. ఇదీ జిల్లాలో ఎస్సారెస్పీ వరదకాలువ సమీపంలో భూములు ఉన్న రైతుల ఆవేదన. వరదకాలువ జలకళ సంతరించుకున్నా తమ భూముల్లోకి నీళ్లు రాని పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు.

జిల్లాలో 60 కిలోమీటర్ల పరిధిలో వరదకాలువ

జగిత్యాల జిల్లాలో ఎస్సారెస్పీ వరదకాలువ సుమారు 60 కిలోమీటర్ల పొడువుతో విస్తరించి ఉంది. ఇబ్రహీంపట్నం మండలంలో మొదలైన వరద కాలువ మెట్‌పల్లి, కథలాపూర్, మేడిపెల్లి, బీమారం, మల్యాల మండలంలోని గ్రామాలకు విస్తరించి ఉంది. ఎస్సారెస్పీ నుంచి నీరు వదలడం, కాళేశ్వరం నుంచి రివర్స్‌పంపింగ్ ద్వారా వరదకాలువలోకి నీళ్లు రావడంతో అందులో జలకళ సంతరించుకుంది.



వరదకాలువలో ఉధృతంగా పారుతున్న నీరు

జిల్లాలో 1,36,789 వ్యవసాయ మోటార్ కనెక్షన్లు

జిల్లాలోని 20 మండలాల్లో సాగుకోసం ఓపెన్‌వెల్, బోరుబావులకు 1,36,789 విద్యుత్‌మోటార్ల కనెక్షన్లు ఉన్నాయి. పలువురు రైతులు బోర్లు వేయించుకుని కొత్త కనెక్షన్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఇవే కాకుండా 1,000 మంది రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

మంజూరులో జాప్యంతో రైతులు ఆందోళన

ఎస్సారెస్పీ వరదకాలువ సమీపంలో భూములున్న రైతులు కొత్త విద్యుత్‌మోటార్ల కనెక్షన్ల మంజూరుకు దరఖాస్తులు పెట్టుకుంటే ట్రాన్స్‌కో అధికారులు జాప్యం చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి బోర్లు వేస్తే చుక్కనీరు రాక అప్పులపాలయ్యామని.. వరదకాలువ నీళ్లతో పంటలు కాపాడుకుందామంటే అధికారులు స్పందించకుండా, నిబంధనల పేరిట ఇబ్బంది పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త విద్యుత్ మోటార్లు కనెక్షన్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

రెండేళ్లయినా కనెక్షన్ ఇవ్వలేదు



కథలాపూర్ శివారులో ఐదెకరాల భూమి ఉంది. బోర్లు వేసిన చుక్కనీరు రాలే. మా భూమికి సమీపంలో వరద కాలువ ఉంది. అక్కడి నుంచి మోటార్‌తో నీళ్లు పారించుకుందామని పైపులైన్ వేసిన. అధికారులు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయడం లేదు. రెండేళ్ల క్రితం దరఖాస్తు పెట్టుకున్న. ఇప్పటికి దిక్కులేదు. త్వరగా కనెక్షన్లు మంజూరు చేయాలి.

– బావు రవీందర్, రైతు, కథలాపూర్

కనెక్షన్లు ఇవ్వాలి



భూషణరావుపేట శివారులో మాకు భూమి ఉంది. బోర్లు వేయిస్తే నీళ్లు సరిగా రాలేవు. వరదకాలువకు పైపులైన్ వేస్తే మా 8 ఎకరాల భూమి సస్యశామలంగా మారుతుంది. కానీ వరదకాలువ నుంచి పైపులైన్ వేసుకుంటే విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేరని తోటి రైతులు చెప్పడంతో బాధపడుతున్నం. కొత్త మోటార్ కనెక్షన్లకు అడ్డంకులు పెట్టడం బాధాకరం. రైతుల సంక్షేమం కోసం కొత్త కనెక్షన్లు ఇప్పించాలి.

– గడ్డం శశిధర్‌రెడ్డి, రైతు, భూషణరావుపేట

నిబంధనల మేరకు ఇస్తున్నం



వ్యవసాయ విద్యుత్ మోటార్లకు కొత్త కనెక్షన్లు నిబంధనల మేరకు మంజూరు చేస్తున్నాం. ఎస్సారెస్పీ వరదకాలువకు ఏర్పాటు చేసే విద్యుత్‌మోటార్లకు కనెక్షన్ కావాలనుకునే రైతులు దరఖాస్తు చేసుకోవాలి. క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా మంజూరు చేస్తాం. రైతులకు ఏమైనా సందేహాలుంటే ట్రాన్స్‌కో అధికారులను సంప్రదించాలి.

– సుదర్శనం, ట్రాన్స్‌కో ఎస్‌ఈ,జగిత్యాల

క్లుప్తంగా

లాతూర్ వ్యవసాయ మార్కెట్ సందర్శన



లాతూర్ వ్యవసాయ మార్కెట్ వద్ద మార్కెట్ కమిటీ సభ్యులు

ఇబ్రహీంపట్నం: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు విజ్ఞాన యాత్రకు బయలుదేరారు. సోమవారం మహారాష్ట్రలోని లాతూర్ వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించి మార్కెట్ కమిటీ కార్యదర్శి సతీష్ ఘోష్ అక్కడ మార్కెట్ యార్డులో సోయాబిన్, కందుల కొనుగోలు, మార్కెట్ వ్యవహారాలు, పనితీరు కమిటీ సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఏలాల వెంకట్‌రెడ్డి, కమిటీ సభ్యులు, మార్కెట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దయ్యే వరకూ పోరాటం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కోరుట్ల రూరల్: ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేసే వరకూ పోరాటం సాగిస్తామని పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వెంకట సుధీర్ అన్నారు. సెప్టెంబర్ 1న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద నిర్వహించే మహా ధర్నా పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ధర్నా విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సురేఖ, సైఫొద్దీన్,జోతిలక్ష్మి, నరహరి, శ్రీనివాస్, యూసుఫ్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ కి నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: నేతాజీ సుభాస్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా సోమవారం జగిత్యాల తహసీల్ చౌరస్తాలో భారత్ సురక్షా సమితి నాయకులు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దేశ ప్రజల్లో జాతీయ స్ఫూర్తి రగిల్చిన మహనీయుడని, సుభాస్ చంద్రబోస్ భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించారని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఏసీఎస్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లి కాశీనాథం, ఉపాధ్యక్షుడు వేముల పోచమల్లు, బండారి మల్లికార్జున్ పాల్గొన్నారు.

దుబ్బరాజన్న ఆలయంలో శ్రావణ సందడి



క్యూలైన్లలో భక్తులు

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయంలో శ్రావణ చివరి సోమవారం కావడంతో భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు కోడె మొక్కులు, గండదీపం, నిలువెత్తు బంగారం సమర్పణ, అభిషేకాలు చేసి స్వామివారికి మొక్కులు చెల్లించారు. భక్తులకు అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో అనూష, వ్యవస్థాపక ధర్మకర్త శంకరయ్య, రెన్నొవేషన్ కమిటి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

రాయికల్: గోదావరి తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్ హెచ్చరించారు. సోమవారం జగన్నాథపూర్ మురళీధర్ గోశాల, నాయికపుగూడెం ప్రజలను కలిసి గోదావరి తీర ప్రాంతానికి ఎవరూ వెళ్లవద్దని సూచించారు. ఆయన వెంట ఎస్సై సుధీర్‌రావు, ఎంపీడీవో చిరంజీవి ఉన్నారు.

వెల్గటూర్: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కోటిలింగాల వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కోటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు చేపట్టారు. గోదావరిలో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పాఠశాలల్లో బోధనోపకరణాల మేళా



మేళాను పరిశీలిస్తునన్న ఎంపీడీవో, ఎంఈవో



మెట్‌పల్లి మేళాలో ఉపాధ్యాయులు, ఎంఈవో

రాయికల్: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం మండలస్థాయి బోధనోపకరణాల మేళా నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్తమ బోధన ఉపకరణలు రూపొందించిన ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి, ఇన్‌చార్జి తహసీల్దార్ ఉదయ్, ఎంఈవో రాఘవులు, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ కడకుంట్ల అభయ్‌రాజ్, జిల్లా రిసోర్స్‌పర్సన్ రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని గడి పాఠశాలలో సోమవారం మండల స్థాయి బోదనాభ్యాస మేళాను నిర్వహించారు. ఈ మేళాను ఎంపీడీవో రామకృష్ణ ప్రారంభించారు.మేళాలో సుమారు 100కు పైగా ప్రదర్శనలు ప్రదర్శించారని ఉత్తమమైన 10 ప్రదర్శనలు జిల్లా స్థాయి పోటీలకు పంపుతామని మండల విద్యాదికారి గంగుల నరేషం పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని గాజులపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం బోధన అభ్యాసన సామాగ్రి మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు, గణితం, అంగ్లంలతో పాటు పరిసరాల విజ్ఞానం తదితర బోధన అంశాల నుంచి తయారు చేసిన అభ్యాసన సామగ్రిని ఈ మేళాలో ప్రదర్శించారు. వీటిలో అత్యున్నతంగా ఉన్న పది టీఎల్‌ఎంలను జిల్లా స్థాయి మేళాకు ఎంపిక చేశారు. మేళాను ఎంఈవో చంద్రశేఖర్ పరిశీలించి ప్రతిభ చూపిన వారిని అభినందించారు.

మల్యాల: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు బోధనోపకరణాలు ఉపయోగించాలని ఎంఈవో జయసింహరావు అన్నారు. మల్యాల బాలుర ఉన్నత పాఠశాల లో సోమవారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నతస్థాయి ఉపాధ్యాయులు టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ మేళా నిర్వహించారు. సబ్జెక్టుల వారీగా బోధనోపకరణాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంఈవో జయసింహారావు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించడానికి 10 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి, వారికి సంబంధించిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ను అందించేందుకు మేళా ప్రారంభించినట్లు మండల విద్యాదికారి ఆకుల లక్ష్మీనర్సయ్య తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం అబ్దుల్ హమీద్, న్యాయ నిర్ణీతలు గంగాధర్, పెద్దిరాజు, రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ధర్మపురి: పట్టణంలోని పలు వార్డుల్లో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను వేగవంతం చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్ అన్నారు. ధర్మపురిలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులపై సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని వివిధ వార్డులో జరుగుతున్న డ్రైనేజీ పనులతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నత్తనడకన సాగుతున్నాయని దీంతో వార్డుల్లో ఉన్న నీటి గుంటల్లో దోమలు చేరని ప్రజలు రోగాల బారిన పడే అవకాశాలున్నాయని అందుకు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని డిమాండు చేశారు. లక్షలాది రూపాయలతో చేపడుతున్న రోడ్లు, డ్రైనేజీ పనుల్లో నాణ్యత లోపిస్తుందని సంబంధిత అధికారులు పనులను పరిశీలించాలని డిమాండు చేశారు. భారీ వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బెజ్జారపు లవన్‌కుమార్, పల్లెర్ల సురేందర్, వైకుంఠం,అప్పం మల్లేశ్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రావు



వెంకటేశ్వర్‌రావు

కథలాపూర్: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కథలాపూర్ మండలం తాండ్య్రాల గ్రామానికి చెందిన రాచముడుగు వెంకటేశ్వర్‌రావును నియమిస్తూ ఆ పార్టీ ప్రతినిధులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటేశ్వర్‌రావు బీజేపీలో వివిధ హోదాలో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. ఆయన సేవలను గుర్తిస్తూ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు పేర్కొన్నారు. వెంకటేశ్వర్‌రావు నియామకం పట్ల బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతి, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ప్రతాప్ హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా ప్రధాన కార్యదర్శిగా కారండ్ల మధుకర్

మేడిపల్లి: బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శిగా వేములవాడ నియోజకవర్గం, భీమారం మండలంలోని గోవిందారం గ్రామ వాసి కారండ్ల మధుకర్ ని నియమిస్తూ రాష్ట్ర నాయకత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి తెలిపారు. మధుకర్ ఎంపికపై ఉమ్మడి మేడిపల్లి మండల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

వంతెన అప్రోచ్ రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి



వంతెన అప్రోచ్ రోడ్డును పరిశీలిస్తున్న జీవన్‌రెడ్డి

సారంగాపూర్: తుంగూర్-కండ్లపల్లి మధ్య వంతెనకు ఒక పక్క అప్రోచ్ రోడ్డు కోతకు గురై రాకపోకలు నిలిచిపోయాయని తక్షణమే అధికారులు మరమ్మతులు చేపట్టాలని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన వంతెనను పరిశీలించి కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేసి రాకపోకలు పునరుద్ధరించాలని కోరారు. ఆయన వెంట విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, మాజీ ఎంపీపీ మసర్తి రమేశ్, మాజీ వైస్‌ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, నాయకులు గుడిసె జితేందర్, రంగు లక్ష్మణ్ ఉన్నారు.

వంతెనకు మరమ్మతులు చేపట్టాలి

తుంగూర్-కండ్లపల్లి మధ్య వంతెన ఇరువైపుల రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆమె వంతెనను పరిశీలించారు. అంతకు ముందు దుబ్బరాజన్న ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆమె వెంట మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, మాజీ విండో చైర్మన్ సాగి సత్యంరావు, బీఆర్‌ఎస్ మండలాల పార్టీ అధ్యక్షులు తేలు రాజు, నేరెళ్ల సుమన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

జగిత్యాలక్రైం: వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని పట్టణ సీఐ కరుణాకర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జగిత్యాల పట్టణంలో గణేశ్ మండప నిర్వాహకులు 9 రోజుల పాటు జరిగే నవరాత్రి ఉత్సవాలపై మంగళవారం ఉదయం 11 గంటలకు దేవిశ్రీ గార్డెన్స్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గణేశ్ నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు, మండప నిర్వాహకులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలి

జగిత్యాలటౌన్: ప్రీప్రైమరీ, పీఎం శ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే బోధించి ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, హామీల అమలు కోరుతూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జగిత్యాల కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పుప్పాల శ్రీకాంత్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌తో పాటు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేందుకు నూతన జాతీయ విద్యావిధానం అమలు తెచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోకన్వీనర్ కోమటి చంద్రశేఖర్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎ రజిత, కార్యదర్శి జి స్వప్న, నాయకులు వెంకటచారి, బొర్ర శేఖర్, వి జ్యోతి, మణెక్క, సత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి స్పందన



వ్యర్థాలు తొలగించారు

కోరుట్ల రూరల్: మండలంలోని మాదాపూర్ గ్రామ శివారులో మాదాపూర్-పైడిమడుగు రోడ్డ పక్కనే మెడికల్ వ్యర్థాలు పారవేయటంతో 'రోడ్డు పక్కనే మెడికల్ వ్యర్థాలు' అనే శీర్షికన ఈ నెల 12వ తేదీన ఫొటో స్టోరీ ప్రచురితమైంది. దీనికి ఎంపీడీవో రామకృష్ణ స్పందించారు. రోడ్డు పక్కనే పారవేసిన మెడికల్ వ్యర్థాలను తొలగించాలని స్థానిక పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఎండీడీవో ఆదేశాలతో సోమవారం మాదాపూర్ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది మెడికల్ వ్యర్థాలను తొలగింపజేశారు.



మురికి కాలువ శుభ్రం

కోరుట్ల టౌన్: పట్టణంలోని వినోబారోడ్‌లో మురికి కాలువ దెబ్బతిని మురికి నీరు నిల్వ ఉండటంతో సాక్షి దినపత్రికలో సోమవారం ఫొటో స్టోరీ ప్రచురితమైంది. దీనికి బల్దియా కమిషనర్ స్పందించారు. సోమవారం మున్సిపల్ సిబ్బందితో మురికి కాలువను శుభ్రం చేయించారు. దెబ్బతిన్న మురికి కాలువకు మరమ్మతులు చేపడుతామని కమిషనర్ పేర్కొన్నారు.

ఘనంగా సర్వాయి పాపన్న జయంతి





ధర్మపురి, కోరుట్ల మండలం యూసుఫ్ నగర్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు



ఇటిక్యాలలో గౌడ సంఘం నాయకులు నివాళి

కోరుట్ల/కోరుట్లరూరల్/రాయికల్/ధర్మపురి/కొడిమ్యాల/పెగడపల్లి/కథలాపూర్/బుగ్గారం/ఇబ్రహీంపట్నం/గొల్లపల్లి: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సామాజిక న్యాయం కోసం పోరాటం చేసిన గొప్పవ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్న అని వక్తలు కొనియాడారు. కార్యక్రమాల్లో గౌడ సంఘం నాయకులు, గీత కార్మికులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

సహస్ర లింగాల ఆలయంలో పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస గ్రామ శివారులోని సహస్ర లింగాల ఆలయంలో శ్రావణ సోమవారం పురస్కరించుకుని పెద్ద ఎత్తున భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నపూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు నలమాసు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో మహాబిల్వార్చన

మెట్‌పల్లి: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో సోమవారం మహాబిల్వార్చన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అశోక్ శర్మ, శుక్లసాగర్ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, అష్టోత్తర పూజలతో పాటు మహాబిల్వార్చన జరిపారు. దీనికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకాగా, వారికి తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు దొమ్మాటి ప్రవీణ్, ఉపాధ్యక్షులు అంకతి భరత్, బండారి మారుతి, చిలమంతుల శివ, చిట్యాల నరేశ్ తదితరులున్నారు.

కోటేశ్వరస్వామికి అన్న పూజ

వెల్గటూర్: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కోటిలింగాల కోటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాస నాలుగో శనివారం సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి అన్నపూజ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచే భారీ వర్షం కురుస్తున్నా భక్తులు స్వామి వారి దర్శనానికి పోటెత్తారు. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు.

ఆలయానికి మైక్‌సెట్ అందజేత

రాయికల్: మండలంలోని భూపతిపూర్ గ్రామంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి సోమవారం సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామానికి చెందిన పోతు శంకర్-ఉమ దంపతులు రూ.20 వేల విలువ గల మైక్‌సెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు కాకుస్తం వెంకటకృష్ణ, వెంకటరమణ, ఆలయ చైర్మన్ మహేశ్, నాయకులు జక్కుల చంద్రశేఖర్, గుగ్రం మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

సెప్టెంబర్ 1న పీఆర్‌టీయూ మహాధర్నా

సారంగాపూర్: సీపీఎస్ రద్దును కోరుతూ సెప్టెంబర్ 1న పీఆర్‌టీయూ (టీఎస్) ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గోవర్ధన ప్రసాద్ పేర్కొన్నారు. మహాధర్నా పోస్టర్‌ను సోమవారం ఎంపీడీవో చౌడారపు గంగాధర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ముదులాకర్ ఉమేష్, ఎనుగందుల గోపి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మల్యాల: సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న నిర్వహించే మహాధర్నాకు ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అబ్దుల్ జమీల్ అన్నారు. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న మహాధర్నా పోస్టర్‌ను సోమవారం మల్యాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, కిశోర్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.